
https://kirontypeinstitute985233150.wordpress.com/

శ్రీ అరుణాచల శివ అరుణాచల శివ

శ్రీరస్తు

శుభమస్తు

- భావార్థముతో. -



అవిఘ్నమస్తు

సేకరణ: కిరణ్ టైప్ ఇనిస్టిట్యూట్, 41-1/8-13A.,
గౌతమీనగర్,3వ లైను, కృష్ణలంక, విజయవాడ-520 013.
https://madhirafamily.wordpress.com/

" అక్షర మణమాల "

తిరువణ్ణామలై పట్టణంలో ఆహారాన్ని యాచించడం కోసం రమణ మహర్షి భక్తులు వెళ్ళేవారు. తాము రమణ మహర్షి శిష్యులుగా గుర్తింపు పొందుట కొరకు అవి పాడుతూ యాచన చేద్దామని పద్యాలు వ్రాయమని రమణ మహర్షిని ప్రార్థించారు. వారి అభ్యర్ధనపై భగవాన్ రమణులు ఈ "అరుణాచల మణమాల" వ్రాసారు తనను వధువుగా, శివుని వరునిగా ఇందులో రమణులు భావించారు.

"అక్షర" అనేది సంస్కృత పదం. ఇది నాశనం చేయలేని అక్షరం. తమిళ భాషలో "మన" అంటే "వివాహం". "మలై" అంటే "దండ". వధువు రమణ మహర్షి, వరుడు అరుణాచలేశ్వరుడు. అంటే "అక్షర మనామలై" అంటే రమణ మహర్షి చేత వ్రాయబడిన వివాహలేఖల (దండల) అలంకరణ. ఇంకొక రకంగా 'అక్షర మణమాల" అంటే "సువాసన గల దండ" అని అర్థం.

అరుణాచలమనేది సాధారణ జీవికి ఒక కొండ. భగవాన్ రమణుల అనుభవం మాత్రం భిన్నం. కరుణా సముద్రుడైన శివుడే ఘనీభవించిన కొండై నిలిచాడన్న అనుభూతి వారిది. తనకు, అరుణాచలానికి తేడా ఏమి లేదన్న అభేద, అద్వైత స్థితి. అద్వైత స్థితిలో అరుణాచలాన్ని రమణులు సంబోధించిన పరమాద్భుత కవితావైఖరి ఆపాతమధురం.

"మణమాల" అంటే కళ్యాణమాల. అది నాశమెరుగని, పసివాడని జీవాత్మ పరమాత్మ బంధమైతే "అక్షర మణమాల" ఇదొక దివ్య సాధనామార్గం. ద్వైతంతో ప్రారంభమై అద్వైతంగా ముగిసే అందమైన భావగీతం.

లోతుగా అధ్యయనం చేసి, అనుభూతి చెందగలిగితే, అక్షరమణమాల సుషుమ్నా గీతం. అహం నశిస్తే తప్ప సోహం స్థితి లభించదని చెప్పే సాధనా గీతం. రమణుల సాలోక్య, సామీప్య, సాన్నిధ్య, సాయుజ్య స్థితులను ఆవిష్కరించే రమణీయ హృదయగానాన్ని విందాం! అని పెద్దలు ఈ అక్షరమణమాల నేపథ్యాన్ని పలికారు. ఇందులో 108 చరణాలు ఉంటాయి.

- - - = - - -

శ్రీ అరుణాచల శివ అరుణాచల శివ - భావార్థముతో.

ఈ మణమాల మధుర భక్తి సంప్రదాయంలో వ్రాయబడింది.

...రమణులు తానొక "వధువు"గా... అరుణాచలేశ్వరుడిని "వరుడి"గా భావించారు...

భక్తులు ఇది గమనించి ఈ భావాన్ని అర్థం చేసుకోగలరు.

- - - = - - -

గణపతి ధ్యాన శ్లోకమ్

సాక్షాదరుణగిరీశ్వర వరార్హమగు నక్షరమనమాల నమరించుటకును
కరుణాకరుండగు గణపతి యొసగి కరమభయకరము, కాపాడుగాక

అరుణాచల వరశ్రేష్ఠుని స్తుతించుటకు తగిన అక్షరముల వరమాలను కరుణాకరుడగు
గణపతి అనుగ్రహించి కాపాడుగాక!

అరుణాచల శివ అరుణాచల శివ అరుణాచల శివ అరుణాచలా
అరుణాచల శివ అరుణాచల శివ అరుణాచల శివ అరుణాచలా

.. అరుణాచల రూపంలోనున్న ఓ పరమశివా ..

01. అరుణాచల మనుచు స్మరియించువారల
అహము నిర్మూలింపు మరుణాచలా

ఓ అరుణాచలా! నిన్ను తలచుకున్నవారికి అహంకారమును నిర్మూలింపుము స్వామి.

- - - - - -

అరుణాచలమని తమ అంతరంగమున స్మరించు భక్తుల అహంకారమును వేర్లతో సహా
పెళ్లగించి నాశనము చేయుము అరుణాచలా!!

02. అళగు సుందరముల వలె చెరి నేను
నివుందమభిన్నమై అరుణాచలా

ఓ అరుణాచలా! తమిళంలో "అళగు" - సంస్కృతంలో "సుందరము" -
అను పదములు వేరే అయినా.. వాటి అర్థము (అందం) ఒకటైనట్లు ..
నువ్వు నేను అని ఉపాదులు వేరుగా అనిపించినా పరమార్థం ఒక్కటే..

- - - - - - -

అందము, సుందరము అను పదములు వేరయినా అర్థము ఒకటే అగునట్లు నీవు నేను
అన్న ఉపాధులు వేరుగా తోచినా పరమార్థమున ఒకటే అరుణాచలా!!

03. లోదూరి లాగి ని లోగుహను చెరగా
అనుసరించి తేమోకొా అరుణాచలా

నా హృదయంలో దూరి నన్ను నా ఇంట్లోనుండి బలవంతంగా బయటకు తీసుకొచ్చావు..
గుహలాంటి నీ హృదయంలో బంధించావు.. ఏమి లీలయ్యా నీది ఓ అరుణాచలా!

- - - - - - -

నా మనస్సను ఇంటిలో దూరి నన్ను బలవంతముగా లాగి నీ హృదయమను ఇంటిలో
బంధించినావు. నీ చిత్రమయిన అనుగ్రహము ఏమని చెప్పుదును అరుణాచలా!!

04. ఎవరికిగా నన్ను యేలితి విడిచిన
అఖిలము నిందించు అరుణాచలా

ఓ అరుణాచలా! ఎవరికోసం నన్ను ఏలుకున్నావు..
అలా ఏలుకొన్న నువ్వు ఇప్పుడు నన్ను వదిలేస్తే ఈ లోకం నిందిస్తుంది కదయ్యా..
అది నాకు బాధ కలిగిస్తుందయ్యా..

- - - - - - -

ఎవరికొరకు నీవు నన్నేలుకొంటివి? ఏలుకున్న నీవే ఇప్పుడు నన్ను వదిలివేసిన, లోకము
నిన్ను నిందించును కదా! అరుణాచలా!!

05. ఈ నింద తప్పు నిన్నేటికి దలపించి
తిక విడు వారెవరరుణాచలా

ఇటువంటి నింద నుండి నిన్ను నువ్వే కాపాడుకో..
నన్నెందుకు నిన్నే తలచుకొనేటట్టు చేశావు.

నీ సాంగత్యంలోని ఆ మాధుర్యం చూసినవాడిని నిన్ను వదలలేను.
అయినా నిన్నెవరు వదలగలరు అరుణాచలా..

- - - - - - -

ఆకారనమయిన ఈ నింద నుంచి నిన్ను కాపాడుకో! నిన్నే స్మరించునట్లు నన్నెందులకు చేశావు, ఇక నిన్నెవరు వదిలెదరు? అరుణాచలా!!

06. కనిన జనని కన్న ఘనదయదాయక
ఇదియా అనుగ్రహం అరుణాచలా

కన్నతల్లి ప్రేమ కన్నా నీ ప్రేమ, దయ గొప్పవి స్వామి..
ఓ అరుణాచలా నీ అనుగ్రహం ఎంత అద్భుతం స్వామి..

- - - - - - -

కని, పెంచు తల్లి ప్రేమ కన్న మిన్నగా భక్తులను ఆదరముతో అనుగ్రహించుచున్నావే! నీ అనుగ్రహము యొక్క గొప్పతనము ఇదేనా అరుణాచలా!!

07. నిన్నేమార్చి యరుగనిక యుల్లము పైని
ఉరుదిగి నుండుమా అరుణాచలా

స్థిరత్వమే లేని నా మనసును నీ సంరక్షణలో నిలుపుతున్నా..
నిన్ను కూడా అది మోసం చేసి భౌతిక విషయాలవైపు పరుగు పెట్టవచ్చు..
కానీ నీ దయ ఉన్నదే.. అదొక్కటే దానిని స్థిరంగా ఉంచేది...
అందుకే నా మనసులో నువ్వుండవయ్యా.. ఓ అరుణాచలా!

- - - - - - -

ప్రాణనాథుడైన నిన్ను ఏమార్చి విషయముల వెంట పరుగెత్తకుండా ఉండేటట్లు చలింపకుండా నా మనసున నీవు ధృఢముగా ఉండుము అరుణాచలా!!

08. ఉరూరు తిరుగక ఉల్లము నిను గన అణగని
ద్యుతి జూపు అరుణాచలా

నా మనస్సు ఈ ప్రపంచాన్ని పట్టుకు తిరుగుతోంది.. దానిని నీ అదుపులో ఉంచి..
నీ సుందర రూపంలో లీనమైయ్యేట్టు దానిని పట్టుకొనేటట్టు చేయవయ్యా..

- - - - - - -

ఎల్లప్పుడు ప్రపంచమునే పట్టుకొని తిరుగు నా మనసునకు నీ సుందరమగు స్వరూపమును చూపి అందే అనగియుండునట్లు అనుగ్రహింపు అరుణాచలా!!

09. నను చెరపి యిపుడు నను కలువక విడుట
ఇది మగతన మొక్కో అరుణాచలా

పక్వమైన నా అహంకారాన్ని నాశనం చేశావు.. నీకూ నాకూ తేడా ఏం లేదు..
నాకంటూ ఇప్పుడు ఏమీ మిగలలేదు.. ఇప్పుడు నన్ను నీవు కలుపుకోలేకపోతే..
నీ పౌరషానికే మచ్చకదయ్యా.. అరుణాచలా!

- - - - - - -

పక్వమయిన నా అహంకారమును ఇప్పుడే నాశనము చేసి, అభిన్నమై నాతో కలవకున్న, పురుషోత్తముడవైన నీ పౌరషము ఇదేనా, అరుణాచలా!!

10. ఏటి కీ నిదుర నన్ని తరులులు లాగగ
ఇది నీకు న్యాయమా అరుణాచలా

నీకింత మొద్దు నిద్ర ఎందుకయ్యా.. నీవాడినైన నన్ను ఇతరులు (జ్ఞానేంద్రియాలు, కర్మేంద్రియాలు వంటివి) లాక్కుపోతున్నా నీకు ఏమి పట్టదా.. నీకిది న్యాయమటయ్యా..

- - - - - - -

నీకే అర్పితమైన నన్ను పరులు లాక్కొని పోవుచుండగా చూసికూడా నిదురించి నట్లుండుట నీకు న్యాయమా! అరుణాచలా!!

11. పంచేంద్రియ ఖలులు మదిలోన
దూరుచో మదిని నీవుండవో అరుణాచలా

నా మనసులో ఎప్పుడూ ఉంటావే.. మరి ఈ పంచేంద్రియ దొంగలు
నన్ను ఎలా దోచుకుంటున్నారయ్యా.. వారికి అదెలా సాధ్యపడుతోంది.
ఇలా చొరబడిన వాళ్ళని నువ్వెందుకు తరిమేయవు స్వామి.

- - - - - - -

పంచేంద్రియములు అనే దొంగలు నా హృదయమున దూరినప్పుడు,
హృదయమున నీవు ఉండవా అరుణాచలా!!

12. ఒకడవౌ నిను మాయ మొనరించి

వచ్చువారు ఏవరిది నీ జాల మరుణాచలా

నువ్వు అన్నీ తెలిసినవాడవు కదా.. నీకు తెలియకుండా నా మనసులోకి ఎవరొస్తారు. ఎలావస్తారయ్యా.. మరి నువ్వు ఉన్న మనస్సులో ఇంద్రియ ఆకర్షణలు ఎలా చేరుతున్నాయ్. హా!.. అర్థమైం×దిలే. ఇదంతా నన్ను పరీక్షించాలని నువ్వు చేస్తున్న ఇంద్రజాలమేకదయ్యా.. ఇది భావ్యమా స్వామి!

\- - - - - -

ఒక్కడివై ఏకాత్మగా ఉన్న నిన్ను మరుగు పరచగల వారెవరు?
ఇది నీ మాయయే అరుణాచలా!!

అరుణాచల శివ అరుణాచల శివ అరుణాచల శివ అరుణాచలా
అరుణాచల శివ అరుణాచల శివ అరుణాచల శివ అరుణాచలా

.. అరుణాచల రూపంలోనున్న ఓ పరమశివా ..

13. ఓంకార వాక్యార్థ ఉత్తమ సమహీన

నిన్నె వరెరుగువరరుణాచల

ఈ విశ్వంలో ఓంకార తత్వానివి నీవే.. నీకు సమానమైన వారు ఎవ్వరూ లేరు స్వామీ.. అయినా నీ వైభవాన్ని ఎవరు గ్రహించగలరయ్యా..

\- - - - - -

ఓంకార తత్త్వమై నీకు సమము లేని వాడవై ఉన్నటువంటి
నిన్నెవరు తెలుసుకొనగలరు... ఓ అరుణాచలా!!

14. అవ్వ బోలె వౌనొసగి నాకు నీ కరుణ,

నన్నేలుట నీ భారం అరుణాచలా

తమిళ భక్తురాలు, కవయిత్రి అవ్వయార్ పై నీ దయను చూపినట్టు, నాపై కూడా దయను వర్షించవయ్యా.. నన్ను కూడా అదే విధంగా కాపాడటం నీకేం భారం కాదు కదా..

\- - - - - -

అవ్వయ్యారు (తమిళ భక్తురాలు..అరవై మూడు మంది నాయనార్లలో ఒకరు) వలె
ఆశ్రయించిన నన్ను ఏలుకొనుట నీ భారము అరుణాచలా!!

15. కన్నుకు కన్నయి కనులేక కను
నిను గనువారెవరు గను అరుణాచలా

నాకు నువ్వు కంటి చూపువు. అది దానంతట అది చూడలేదు.
చూసే శక్తి కళ్ళకు ఇచ్చింది ఆత్మగా ఉన్న నువ్వే కదయ్యా..
చూపుకు మూలం నువ్వే.. ఆత్మజ్ఞానమనే కన్ను ద్వారా నిన్ను చూస్తున్నా..
- - - - - - -
కంటికి వెలుగైన కన్నువై, కన్ను లేకనే సకలమునూ చూడగల్గిన నిన్ను
చూడగల వారెవరు? చూడుము అరుణాచలా!!

16. ఇనుము అయస్కాంతము వలె గవిసి
నన్ను విడువక కలిసి నాతొ నుండుము అరుణాచలా

ఆయ్యా ఆరుణాచల శివ.. ఇనుమును అయస్కాంతం ఆకర్షించినట్టు నన్ను కూడా నీ దగ్గరకు చేర్చుకో.. అయస్కాంతాన్ని చేరిన ఇనుము దాని నుండి ఎలా విడువడలేదో అలా ఎప్పుడూ నిన్నే అంటిపెట్టుకునేలా నాపై దయ చూపవయ్యా!
- - - - - - -
అయస్కాంతము ఇనుమును ఆకర్షించినట్లు, నన్ను నీవు విడువక,
ఏకమై ఉండుము అరుణాచలా!!

17. గిరి రూపమైనట్టి కరుణా సముద్రమా
కృప చేసి నన్నేలు అరుణాచలా

ఓ అరుణాచల శివ.. పర్వతరూపంలో ఉన్న కరుణాసాగరుడవు నీవు..
నీ దయని నాపై వర్షించవయ్యా..
- - - - - - -
గిరి రూపములో ఉన్న ఓ కరుణాసముద్రమా, కృప చేసి నన్ను ఏలుము అరుణాచలా!!

18. క్రింద మీదటను చెన్నొందు కిరణమణి
నా క్రిందు గతి మాపు అరుణాచలా

దేహంతో పారవశ్యం పొందే అల్పత్వం (క్రిందు గతి)ని నశింపజేసి, అహంకారంలో పుట్టి అంధకారంలో విహరించే ఈ అల్పత్వాన్ని నశింపజేసే శక్తి... క్రిందికీ, మీదకి కిరణాలు ప్రసరించే రత్నమంటి వాడవైన నీకు మాత్రమే సాధ్యపడుతుంది స్వామి..

– – – – – –

ఎక్కువ తక్కువ అను భేదములేక వెలిగే జ్ఞానభాస్కరా!
నా అజ్ఞానమును బాపుము అరుణాచలా!!

19. కుత్ర మన్న యంతయు గోసి గుణముగా
పాలించు గురు రూపమై వెలుగు అరుణాచలా

నా దోషాలను నాశనం చేసి గుణవంతుడిగా చేయవయ్యా..
గురు రూపంలో నున్న అరుణాచలా..

– – – – – –

గురురూపమైనట్టి అరుణాచలా! నా దోషములను సమూలముగా నాశనము చేసి,
నన్ను గుణవంతునిగా చేసి కాపాడుము అరుణాచలా!!

20. కూచి వాల్గన్నుల కోతబడక కృప చేసి
నన్ను చేరి కావుం అరుణాచల

నాకు అపకారం తలపెట్టే వారి బారి నుండి, నన్ను వెంటాడుతున్న బల్లెములలా వాడిగా ఉన్న వారి చూపుల నుండి రక్షింపగల సర్వ సమర్థుడవు నువ్వు మాత్రమే స్వామి!

– – – – – –

వంచకుల వలలో పడి, తపించి, నశించి పోకుండా,
కృపతో నన్ను అనుగ్రహించి నాతో కలసి ఉండుము అరుణాచలా!!

21. పంచకా వేడియున్ గొంచెమున్ గరుగవే
అభయ మం చేలుమా అరుణాచలా

దయతో నన్ను రక్షించమని నేను ఎన్నో రకాలుగా వేడుకుంటున్నాను.
కాని నీవు నా పట్ల ఎంతో నిర్లక్ష్యంగా పట్టించుకోవడం లేదు..
దయచేసి రక్షించు. నన్ను స్వీకరించవయ్యా అరుణాచలా!

\- - - - - - -

ఎంతగా వేడిననూ వంచకుని వలె కరగని ఓ అరుణాచలా!
కరుణతో అభయమిచ్చి కాపాడుము అరుణాచలా!!

22. అడుగకిచ్చెడు నీదు అకళంక మగు కీర్తి
హాని సేయక బ్రోవు మరుణాచలా

భక్తులు ఎవరూ నిన్ను అడుగనక్కరలేదు. వారిపై దయని చూపిస్తావని నీకు పేరు కదా.
కావల్సినది ఇస్తావని నీకు కీర్తి ఉంది.. దానికి ఇప్పుడు మచ్చ తీసుకురాకు.
నాకు ఎటువంటి కీడు రాకుండా కాపాడు.

\- - - - - - -

భక్తులు అడగకపోయినా ఇచ్చే వాడివి అనే అకళంక కీర్తికి మచ్చరానీయకుండా
నన్ను అనుగ్రహించుము అరుణాచలా!!

23. హస్తాంగ కని నీదు దద్రసమున
సుఖోన్మాద మొందగ యేలు మరుణాచల

అరుణాచలా! అరచేతిలోని ఉసిరికాయలా సులువుగ ఆధీనమగువాడవు నీవు. అరచేతి ఉసిరికాయలా ఇతరులు చెప్పనక్కరలేకయే స్పష్టంగా నాకు జ్ఞానం తెలియాలి. నిజమైన సుఖం యొక్క ఉన్మాదాన్ని పొందాలి. నీయందే ఉన్న మనస్సుతో చేతనా చేతనముల యందు నేను సమానంగా ప్రవర్తించాలి. అలా అనుగ్రహించుమయ్యా..

\- - - - - - -

హస్తామలకమగు నీ స్వత్ స్వరూప రసమును అనుభవించి సుఖోన్మాదమున
మైమరచునట్లు నన్ను అనుగ్రహించు అరుణాచలా!!

24. వల నుంచి భక్తుల పరిమార్చి నిను
గట్టుకొని యెట్లు జీవింతును అరుణాచలా

భక్తుల జీవత్వాన్ని నశింపచేయడమే ధ్వజంగా కలిగిన నిన్ను నేను వివాహం చేసుకుంటే నేనొక వ్యక్తిగా ఇక ఉండగలనా. నీలో పరిపూర్ణంగా ఐక్యమైపోతాను కదయ్యా..

\- - - - - - -

భక్తుల జీవత్వమును నశింపజేయడమే ధ్వజముగా గల నిన్ను
నాయకునిగా యెంచి నేనెలా బ్రతుకుదును అరుణాచలా!!

అరుణాచల శివ అరుణాచల శివ అరుణాచల శివ అరుణాచలా
అరుణాచల శివ అరుణాచల శివ అరుణాచల శివ అరుణాచలా

.. అరుణాచల రూపంలోనున్న ఓ పరమశివా ..

25. కోపరహిత గుణ గురిగాగ నన్ను గొను
కొరయేమి చేసితి అరుణాచలా

ఓ పరమశివా! కోపంతో పాటు అన్ని ఆవేశాలనూ నీవు జయించావు. మరి నన్నెందుకు ఆ కోపతాపాలకు గురిచేస్తున్నావయ్యా. కోపగుణాన్ని నాకు అంటగట్టి నన్ను వెంటాడుతున్నావెందుకు. నేను చేసిన తప్పేమిటి చెప్పు.. నేనేం చేశానయ్యా..

\- - - - - - -

కోపము లేని స్వభావుడా! ఇందరి భక్తులలో
గురిచూసి నన్ను గ్రహించుటకు కొర ఏమి చేసితిని అరుణాచలా!!

26. గౌతమ పూజిత కరుణా ఘన నగమా
కడ గంట యేలుమా అరుణాచలా

అరుణాచలా! ఓ దయామూర్తి! గౌతమ మహర్షిచే పూజింపబడినవాడా.. నీ అనుగ్రహపు చూపు నాపై ప్రసరించుగాక..

\- - - - - - -

గౌతమ ఋషి పూజించు కరుణా ఘననగమా!
కడగంటి చూపుతో నన్నేలుము అరుణచలా!!

27. సకలము కబళించు కరకాంతియిన
మను జలజ మలర్పుమా అరుణాచలా

ఈ ప్రపంచంలో చీకటిని సూర్యుడు మాయం చేసినట్టు.. సూర్య కిరణాలు తామర మొగ్గలను వికసింపజేసినట్టు.. నా అజ్ఞాన చీకటిని సూర్యుడవై తొలగించి నా హృదయ పద్మాన్ని వికసింపచేయవయ్యా..

\- - - - - - -

జ్ఞాన కిరణములతో సకలమును కబళించు ఓ అరుణాచలా!
నా మనోజలజమును వికసింప జేయుము అరుణచలా!!

28. తిండిని నిన్జేరితిని తిన నా నేను
శాంతమై పోవుదును అరుణాచలా

నిన్ను తిందామని వచ్చిన నేను నీకు ఆహారమైనట్టు - నిన్ను నా వాడిని చేసుకుందామనుకున్నా కానీ, నువ్వే నన్ను నీలో కలుపుకున్నావు.. వశపరుచుకున్నావు.. నా అహంకారిన్ని తీసేసి నువ్వు నేను అను వేరు భావాన్ని నశింపజేశావు. నాకు ఇంక మరే కోరికా లేదు స్వామి..

\- - - - - - -

నాకు నీవు ఆహారమనుకొని తినుటకు నీ దరిజేరితిని, కానీ నీవు నన్ను కబళించడం వల్ల, నేను పూర్తిగా నశించి శాంతుడనైతిని అరుణచలా!!

29. మది చల్లపడ భద్రకర ముంచి అమృతను
తెరు మనుగ్రహచంద్ర మరుణాచలా

చంద్రుని చల్లని కిరణాలు సోకిన కలువ వికసించునట్లు - నీ కిరణ స్పర్శతో నా హృదయ కలువను వికసింపజేయవయ్యా.. నీ అమృత హస్తాన్ని చాపి ఉంచితే నా మనసు చల్లబడుతుంది. అమృతంతో నిండిన నీ నోటిని తెరచి మాట్లాడవయ్యా..

\- - - - - - -

మది చల్లబడునట్లు నీ అమృత హస్తమును ఉంచి అమృతముతో నిండి మూయబడిన నోటిని తెరచి నన్ను అనుగ్రహించు అరుణాచలా!!

30. వన్నెను చెరపి నిర్వాణ మొనర్చి
కృపవన్నె నిడి బ్రోవు మరుణాచలా

స్వామీ అరుణాచలా! నన్ను వివస్త్రను చేసి నగ్నంగా నీ ఎదుట నిలబెట్టి నీ దయా వస్త్రాన్ని కప్పవయ్యా.. నీ చేతుల్లోకి నన్ను తీసుకోవయ్యా..

\- - - - - - -

నా వన్నెను నాశనము చేసి, నన్ను నిర్వాణము చేసి,
నీ కృపావన్నెను ప్రసరింపచేసి నన్ను కాపాడుము అరుణాచలా!!

31\. సుఖ సముద్రము పొంగ వాంగ్ మనమ్ము
లడంగ ఊరక అమరు మందురుణాచల

నా హృదయంలోకి వచ్చి దానిని మౌనంతో నింపేయవయ్యా.. సర్వ వ్యాపకుడివైన నీలో కలిసిపోయినప్పుడు ఇంక నాకు మాటతో పనేమిటి స్వామి.. అద్భుతమైన సుఖ సముద్రంగా పొంగుతున్న మనస్సును శాంతం, మౌనంలో అణగిపోయేటట్లు ఉంచవయ్యా..

\- - - - - - -

హృదయము సుఖ సముద్రమై పొంగి, వాక్కు, మనసులు అణుగునట్లు నీవు ఊరక ఉండుము అరుణాచలా!!

32\. వంచింతువేల నన్ శోధింపకిక నీదు
జ్యోతి రూపము చూపుం అరుణాచల

ఇంకా ఎంత కాలం ఇలా నన్ను మోసం చేస్తావయ్యా.. ఈ దోబూచులాట, పరీక్షలు ఇంకెన్నాళ్ళు.. ఇక శోధనలొద్దు. నీ దయ చూపి నన్ను అనుగ్రహించు. ఒక్కసారి నీ మనోహరమైన జ్యోతి రూపాన్ని దర్శించనీయవయ్యా..

\- - - - - - -

వంచన చేసి ఇంక నన్ను శోధించకుండా, నీ జ్యోతి రూపమును చూపుము అరుణాచలా!!

33\. పరవిద్య గరపి యీ భూమి మైకము వీడి
రూపగు విద్య జూపు అరుణాచలా

ఇంతకాలం ఈ ప్రపంచ విషయవాంఛలపై, భ్రమల్లోనే బ్రతికాను.. ఆ మైకంలో నిన్ను పట్టించుకోలేదు స్వామి.. ఈ భ్రమలను అంతం చేసి ముక్తి నిచ్చే విద్యను అనుగ్రహించవయ్యా..

\- - - - - - -

మాయాజాల విద్యలన్నీ నేర్చి, ప్రపంచ మోహములో పడి ఉన్న నాకు,
తరింప చేయు విద్యను చూపుము అరుణాచలా!!

34.చేరకున్నను మేను నీరుగ కరగి
కన్నిటే రయి నశింతు అరుణాచలా

నా శరీరము నువ్వే.. నా మనస్సు నువ్వే.. నా ప్రతి అణువణువూ నిన్నే కోరుకుంటోంది అరుణాచలా! ఇక నన్ను నువ్వు స్వీకరించకపోతే ఆ వియోగ బాధను తట్టుకోలేనయ్యా.. ఆలస్యం చేస్తే కన్నీటిలో కరిగిపోతాను.. త్వరగా అనుగ్రహించు స్వామి..

\- - - - - - -

నీవు నన్ను చేరకున్నను నా తనువు నీరుగా కరిగి కన్నీటి ఏరై నశింతును అరుణాచలా!!

35.ఛీ యని ద్రోసిన చేయు కర్మ తపన
గాకేది మను మారం అరుణాచలా

నన్ను నువ్వు నిర్లక్ష్యం చేస్తే నా పూర్వజన్మ చెడు కర్మలు నన్ను కాల్చేస్తాయి స్వామి.. అటువంటి కర్మ ఫలాల నుండి నువ్వు మాత్రమే కాపాడగలవు.. నీ దయ ఒక్కటే కాపాడుతుంది. అటువంటి దయను చూపించవయ్యా..

\- - - - - - -

నీవు నన్ను ఛీ అని త్రోసివేసినచో, చేసిన కర్మతాపము నన్ను దహించి వేయును.
తరించు మార్గమేది చెప్పుము అరుణాచలా!!

36. చెప్పక చెప్పి నీవు మౌనత నుండని
యూరక ఉందువే అరుణాచలా

నువ్వు నిశ్శబ్ధంగా ఉంటున్నావు. స్వామి. నువ్వు చెప్పకనే చెబుతున్నావు. మౌనంగా ఉంటున్నావు. అరుణాచల శివా!

\- - - - - - -

మాటతో చెప్పకనే మౌనముగా ఉండమని చెప్పి, నీవు ఊరక ఉంటివి అరుణాచలా!!

అరుణాచల శివ అరుణాచల శివ అరుణాచల శివ అరుణాచలా
అరుణాచల శివ అరుణాచల శివ అరుణాచల శివ అరుణాచలా

.. అరుణాచల రూపంలోనున్న ఓ పరమశివా ..

37. సోమరి యైతిని మిన్నని సుఖ నిద్ర కన్నా
వేరేది గతి అరుణాచలా

నేను సోమరినయ్యాను.. నా కాలాన్ని విందు వినోదాలతో ఖర్చు చేస్తూ సుఖంగా నిద్రపోతూ నా కాలాన్ని గడుపుతున్నాను.. నాకు అంతిమ లక్ష్యమైన ఆత్మజ్ఞానాన్ని గ్రహించలేదు.. నాకు నువ్వు తప్ప మరే దిక్కు లేదయ్యా పరమ శివా..

\- - - - - - -

నిర్విషయా నందము అనుభవించి సోమరినైతిని,
దీనికి మించిన వేరే గతి ఉన్నదా తెలుపు అరుణాచలా!!

38. శౌర్యము జూపితి శమియించెనని మాయ
చలియింప కున్నావు అరుణాచలా

నీ జ్ఞాన పరాక్రమాన్ని చూపి నా అజ్ఞానాన్ని, మాయను పోగొట్టావు. ప్రాపంచిక భ్రమలు పోగొట్టి నా హృదయంలో స్థిరంగా ఉన్నావు. అరుణాచల శివ స్థిరంగా ఉన్నావు..

\- - - - - - -

నీ శౌర్యము చూపితివి, నా అహంకారము అణగినది. నేను శాంతించితిని.
నీవు అచలడువైనావు అరుణాచలా!!

39. కుక్కకు న్నీచమే నేనే గురుతుగొని వెదకి
నిన్జేరుదు అరుణాచలా

స్వామీ అరుణాచలా! కుక్క తన ఆహారాన్ని వాసనతో కనుగొన్నట్టు నా ఉనికికి (నేను అనే ఆలోచన) ఆధారమైన నిన్ను (ఆత్మను) కూడా వెతికి నేను చేరతాను..

\- - - - - - -

కుక్కకన్నా నీచమయిన నేను విశ్వాసము చేత నిన్ను వెదకి చేరుతాను అరుణాచలా!!

40. జ్ఞానము లేక నీ యాశ దైన్యము బాప
జ్ఞానము దెల్పి బ్రోవు మరుణాచలా

పరమశివా! నాకు జ్ఞానం లేదు - కానీ, నిన్ను చూడాలని, చేరాలని తపన మాత్రం ఉంది. అంతా నీ ఆజ్ఞ.. నీలో ఐక్యం అవ్వాలన్నదే ఈ దీనుని కోరిక స్వామీ..

\- - - - - - -

జ్ఞానము లేకనే నిన్ను చేరాలనే ఆశ వలన కలిగిన ఆయాసము తీరునట్లు,
జ్ఞానము తెలిపి అనుగ్రహింపుము అరుణాచలా!!

41. తేటి వలెను నీవు వికసింప లేదని ఎదుట
నిలుతువేల అరుణాచలా

ఓ పరమేశ్వరా! తామర మొగ్గను వికసింపజేయుట సూర్యుని బాధ్యతైనట్లు నువ్వు సూర్యుడివి.. నా హృదయ పద్మాన్ని వికసింపజేయుట నీ బాధ్యత.. నాకు జ్ఞానం కలిగించుట నీ బాధ్యతయ్యా..

\- - - - - - -

జ్ఞాన సూర్యుడ వయిన నీవు నా హృదయ కమలము వికసింప లేదని,
తేనెటీగవలె నా యెదుట నిలబడితివే! అది ఏమి చిత్రము అరుణాచలా!!

42. తత్వ మెరుగజాలను అంతను నిలుతునె
యిదియేమి తత్వమో అరుణాచలా

నేను ఏ ఆధ్యాత్మిక గ్రంథాలనూ చదువలేదు.. ఏ తత్వములు తెలియవు.. ఎవరి దగ్గర నేర్చుకోలేదు. కానీ నీ దయ వల్ల తత్త్వం, తత్త్వమసి రెండు సత్యములు తెలిసాయి అరుణాచలా!

\- - - - - - -

తత్త్వము ఎరుగకయే బ్రహ్మ తత్త్వమను పొందితిని.
ఆ తత్త్వము ఇదియే అని స్థిరపరుచుము అరుణాచలా!!

43. తానేను తానను తత్వ మిద్దానిని తానుగ
చూపింతు అరుణాచలా

ఓ పరమశివా.. తాను అను తానే తత్వార్థం. దానిని తానే ఆయిన నువ్వు చూపించుము అరుణాచలా! ఇదే నా మనవి స్వామి!

\- - - - - - -

“తాను” అనే తానే తత్త్వార్థము. దీనిని తానే అయిన నీవు చూపించుము అరుణాచలా!!

44\. త్రిప్పి అహంతను ఎప్పుడు లో దృష్టి గన
దెలియు ననునదే అరుణాచలా

మనస్సును అంతర్ముఖం చేసి నీలో ఉన్న ఆత్మ కోసం వెతుకు నేనెవరు అనే విచారము ద్వారానే ఆత్మని తెలుసుకోవచ్చునని చెప్పితివిగా అరుణాచలా!

\- - - - - - -

మనసును అంతర్ముఖము చేసి, లోపల విచారించిన, తానుగా తెలియునని చెప్పితివి, ఇదేమి చిత్రము అరుణాచలా!!

45\. తీరముండని యెద వెదకియు తన్ను నే
తిరిగి పొందితి బ్రోవు మరుణాచలా

తీరం లేని హృదయం నాది. అందులో నీకోసం వెదికాను.. నిన్ను పొందలేక తిరిగి వచ్చేశాను. నన్ను దయచూడవయ్యా అరుణాచలా!

\- - - - - - -

తీరము లేని హృదయమున వెదకి, నిన్ను నేను పొందలేక, తిరిగి వచ్చితిని, కరుణింపు అరుణాచలా!!

46\. సత్య జ్ఞానము లేని యీ జన్మ ఫలమేమి
ఒప్పగ రావేల అరుణాచలా

పనికిమాలిన వ్యాపకాలతో కాలం గడిపేస్తే జన్మ వృథా.. ఆత్మ జ్ఞానాన్ని తెలుసుకోలేని ఈ జన్మ ఎందుకు స్వామి. అటువంటి ఈ జన్మ దేనితో పోల్చేందుకు పనికి రాదు. ఆత్మజ్ఞానాన్ని పొందే అర్హతను నాకు అనుగ్రహించుమయ్యా..

\- - - - - - -

సత్యమును గురించిన జ్ఞానము లేని ఈ జన్మ ఫలమేమి?
దీనిని దేనితో పోల్చి చెప్పనుగాదు అరుణాచలా!!

47. శుద్ధ వాంగ్మన యుతులం దోచు నీ నిజా
హంత గల్పి నన్ను బ్రోవుము అరుణాచలా

నిర్మలమైన మనస్సు, మాట - కలిగినవారే నీలో కలువగలరు.. నీ నిజ స్వభావాన్ని అనుభవించగలరు.. అటువంటి ధన్య జీవులలో నన్నుకూడా ఒకడిని చేయవయ్యా అరుణాచలా!

- - - - - - -

శుద్ధమయిన వాక్కు, మనసు కలిగిన వారు అనుభవించు
నీ నిజ స్వరూపమును నాచే అనుభవింప జేయుము అరుణాచలా!!

48. దైవ మనుచు నిన్ను దరిచేరగా నన్ను
పూర్ణ నాశ మొనర్చితి అరుణాచలా

ఓ అరుణాచలా నిన్ను నా దేవుడని నమ్మి నిన్ను చేరాను.. నీ దగ్గరకు రాగానే నాలో అహాన్ని పోగొట్టావు. నేను అనే భావాన్ని సమూలంగా నాశనం చేశావు నీలో కలుపుకున్నావు..

- - - - - - -

రక్షించు దైవమని నిన్ను దరి జేరిన
నన్ను సమూలముగా నాశనము చేసితివి అరుణాచలా!!

అరుణాచల శివ అరుణాచల శివ అరుణాచల శివ అరుణాచలా
అరుణాచల శివ అరుణాచల శివ అరుణాచల శివ అరుణాచలా

.. అరుణాచల రూపంలోనున్న ఓ పరమశివా ..

49. వెదుకక గనవిన సచ్ఛ్రీయనుగ్రహనిధి
మది తెగుల్ తీర్చి బ్రోవు అరుణాచలా

నేను ఏ ప్రయత్నం చేయకుండా.. వెదకకుండా నాకు దొరికిన అనుగ్రహ నిధివినీవయ్యా.. నా మనస్సులోని భ్రమను పోగొట్టి నా హృదయాన్ని నిత్యమైన శాంతితో నింపవయ్యా అరుణాచలా!

- - - - - - -

వెదుక కుండానే దొరికిన ఓ జ్ఞాన నిధీ!
నా మది భ్రమను తీర్చి కాపాడుము అరుణాచలా!!

50. ధైర్యము పరుగిడు నీ నిజాహమరయ
నే నాశమైతి బ్రోవు అరుణాచలా

నీ నిజ స్వరూపాన్ని తెలుసుకోగలనని ధైర్యంతో భావించి భ్రమించి
నేను విఫలుడనైనాను స్వామి.. నాపై దయ చూపరాదా..
- - - - - -
నీ సత్యస్వరూపమును, నా ధైర్యముతో తెలియగలనని భావించి,
భ్రమించి నశించి పోయితిని అరుణాచలా!!

51. తాకి కృపాకరము నను గలియకున్న
నిజము నశింతు బ్రోవు అరుణాచలా

నీ దయ కలిగిన చేయి నాకు అందివ్వమయ్యా.. లేకపోతే ఈ సంసార సముద్రంలో
మునిగిపోతున్నా.. నిజంగా చెబుతున్నా స్వామి.. నీ దయలేకపోతే నేను
నశించిపోతానయ్యా.. నాపై నీ దయ ఎప్పుడూ చూపించి కాపాడు స్వామి!
- - - - - -
నీ కృపాకరముతో నన్ను స్పృశించి, కౌగలింపకున్న నశించి పోవుదును అరుణాచలా!!

52. దోషరహిత నీవు నాతో నైక్యమయి
నిత్యానంద మయమోనర్పరుణాచలా

శివా! నీది నిష్కళంకమైన పరిపూర్ణత.. నీతో ఐక్యమైతే నాకు కూడా పరిపూర్ణత వస్తుంది
స్వామి.. నీ అనుగ్రహం వల్ల మాత్రమే ఆ ఆనందం సాధ్యం. నీతో నన్ను ఐక్యం చేసుకొని
ఆ స్థితిని ఎప్పటికీ ఉండేలా అనుగ్రహింపయ్యా అరుణాచలా!
- - - - - -
దోషరహితుడవైన నీవు నాతో ఐక్యమయి,
నిత్యానందము అనుభవింప జేసి అనుగ్రహింపుము అరుణాచలా!!

53. నగకు ఎడముకాదు నిన్వేదకిన నన్ను
గను కృపా నగ వేసి అరుణాచలా

నాకు మంచి ఆభరణాలు లేవని నన్ను చూసి నవ్వకు శివా.. ఆ సాకుతో నాపై విముఖత చూపించకయ్యా.. పరిహాసాలకు ఇది సమయం కాదయ్యా అరుణాచలా!
నీ దయ అనే వెల కట్టలేని ఆభరణాన్ని ప్రసాదించవయ్యా..

\- - - - - -

పరిహాసించుటకిది సమయము కాదు.
నన్ను నీ కటాక్ష హాసముతో వీక్షించి అనుగ్రహించుము అరుణాచలా!!

54. గాన లేదె వెదుక నీనయి నీ వొంటి
స్థానువై నిలిచితి వరుణాచలా

నువ్వు తప్ప నాకు వేరే దిక్కులేదని అన్నిటినీ విడిచి పెట్టా శివయ్యా.. నువ్వు నన్ను దగ్గరకు తీసుకుంటావనుకున్నానయ్యా.. కానీ నువ్వు ఏమాత్రం కదలిక లేకుండా స్థంభంలా ఉండిపోయావే ఏం నాపైన ఎందుకయ్యా నీకు అంత నిర్లక్ష్యం ఎందుకయ్యా అరుణాచలా!

\- - - - - -

సిగ్గువిడిచి నేనుగా నీ దరి జేరితిని, నీవేమో స్థాణువు వలె నిలిచితివే అరుణాచలా!!

55. నీ జ్వాల గాన్చినన్ నీరు సేసేడు మున్నె
నీ కృప వర్షింపుము అరుణాచలా

నీ జ్ఞానాగ్ని జ్వాల మంచినీ, చెడునీ కాల్చి బూడిద చేస్తుంది కదయ్యా.. ఆ జ్ఞానాగ్ని నన్ను బూడిద చేయకముందే నీ దయ అనే చల్లని నీటిని నాపైన వర్షించి,రక్షించు అరుణాచలా!

\- - - - - -

నీ జ్ఞానాగ్ని నన్ను దహించి బూడిద కావించుటకు ముందే
నీ కృపా వర్షము కురిపించి నన్ను కాపాడుము అరుణాచలా!!

56. నీవు నీ(నే) నణుగ నిత్యానందమయముగ
నిలుచు స్థితికరుణింపుము అరుణాచలా

నన్ను నీ మనిషిగా చేసుకో స్వామి.. ఈ నువ్వు - నేను అని రెండు భావాలెందుకయ్యా అరుణాచలా.. నిత్యానందం అనేది నీతో కలిసినప్పుడే సాధ్యపడుతుంది..
అందుకే నీతో నీలో ఐక్యమనే ఆనందాన్ని నన్ను అనుభవించనీయవయ్యా..

\- - - - - -

నీవు నేను అనే భేదము మాపి, నీ కౌగిట నను చేర్చి,
నిత్యానందమయునిగా నిలుచు స్థితిని అనుగ్రహింపుము అరుణాచలా!!

57. అణురూపు నిన్ను నే మిన్ను రూపుం
చేర భావోర్మ్మలెపుడాగు నరుణాచలా

అంతటా నువ్వే వ్యాపించి ఉన్నావు స్వామి.. ప్రతి అణువులోనూ నువ్వు ఉన్నావు.. నీతో ఎలా ఐక్యం కాగలనయ్యా.. నా మనసులోని ఆలోచనలు అణగిపోవాలంటే నీ ఆశ్రయం పొందాలి.. అది నాకు ఎప్పుడు లభిస్తుందయ్యా..

- - - - - -

అణురూపుడవైన నిన్ను నా హృదయమందు అనుభవించుటకు అడ్డుపడుచున్న
ఆలోచనల తరంగములు ఎపుడు అణుగును? అరుణాచలా!!

58. సూత్ర జ్ఞానము లేని పామరు నా మాయా
జ్ఞానము కోసి కావు అరుణాచలా

ఏ శాస్త్రాన్ని చదవని వాడను నేను.. అందుకే నా అజ్ఞానానికి మొదలు నరికి నీ అనుగ్రహంతో రక్షించుస్వామీ!

- - - - - -

శాస్త్రజ్ఞానము లేని పామరుడయిన నా అజ్ఞానమును
మొదలంట నరికి, తీసివేయుము అరుణాచలా!!

59. మక్కి మక్కి కరగి నే నిన్ను శరణంద
నగ్నుడవై నిల్చితి అరుణాచలా

నా హృదయం నీపై ఎంతో ప్రేమతో నిండిపోయింది.. నీతో కలిసిపోవాలని కోరిక కలిగి నీ నగ్న సౌందర్యాన్ని చూసానయ్యా.. (భక్తి భావంతో)

- - - - - -

నీ మీద అమిత ప్రేమతో నా మనసు కరిగి కరిగి నిన్నే శరణు పొందగా
నీవు నగ్నుడవయి నిలిచితివి అరుణాచలా!!

60. నేస్తముండని నాకు నీ యాశ చూపినన్
మోసగింపక బ్రోవు మరుణాచలా

మొదటి నుండి నాకంటూ నేస్తం ఎవ్వరూ లేరు.. కానీ నా మనస్సులో నీ మీద ప్రేమ నిండేటట్టు చేశావు.. నా నేస్తానివయ్యావు.. నీతో కలిసిపోవాలని ఆశ కలిగించావు.. నీ దయతో నీ దగ్గరకు చేరాను. ఇక నన్ను మోసగించకయ్యా.. దయతో రక్షించు స్వామి..

– – – – – –

నీపై ఆశయే లేని నాకు ఆశ కలిగించితివి.
ఇక మోసము చేయక కాపాడుము అరుణాచలా!!

అరుణాచల శివ అరుణాచల శివ అరుణాచల శివ అరుణాచలా
అరుణాచల శివ అరుణాచల శివ అరుణాచల శివ అరుణాచలా

.. అరుణాచల రూపంలోనున్న ఓ పరమశివా ..

61. నవిసి చెడు ఫలము నందేమి ఫల మేరి
పక్వత లోగొనుము అరుణాచలా

బాగా పండిపోయి.. కుళ్ళిపోయి పండు తినటానికి పనికిరానటులే –
నేను పండిపోతే నీ నామాన్ని జపించే శక్తిని కోల్పోతానేమోనయ్యా.. నిన్ను తలచుకునే మానసిక స్థితికూడా కోల్పోతానేమో.. ఎందుకంటే నేనిప్పుడు పక్వదశలో ఉన్నాను స్వామి.. కాబట్టి నన్ను స్వీకరించయ్యా..

– – – – – –

కలమాగిన పండు నందు రుచి ఏమి కలదు?
పక్వమెరిగి ఆరగించుట మంచిది అరుణాచలా!!

62. నొవ్వగింపక నిన్ను నొసగి నన్ గోనలేదె
యంతకుడవు నాకు అరుణాచలా

నాకు ఎటువంటి నొప్పి తెలియకుండానే.. ఎటువంటి బాధ పడకుండానే నువ్వు నాకు దక్కావు.. నా అహంకారాన్ని ధ్వంసం చేశిన వాడవు నీవు.. నిజం చెప్పాలంటే నా అహంకారాన్ని చంపిన హంతకుడవు నీవు..

\- - - - - -

తపముల కృశించకుండానే, నిన్ను నాకు అనుగ్రహించితివి! అందుకు బదులుగా
నా ప్రాణములను గ్రహించితివే, నా పాలిట యముడవైతివి అరుణాచలా!!

63\. చూచి చింతించి మేనుం దాకి పక్వము
చేసి నీ వేలి బ్రోవుం అరుణాచలా

(చక్షు, భావ, స్పర్శ ఇవి గురువు ఇచ్చే 3 రకాల దీక్షలు)
నా అహం నశించేలా చక్షు, భావ స్పర్శ దీక్షలతో నన్ను అనుగ్రహించి నన్ను ఎల్లప్పుడూ
నీ భావాలతోనే, నీచూపులతోనే, నీ స్పర్శతోనే పరిపక్వం చేసి రక్షించవయ్యా..
శివా! నన్ను నీ వాడిగా చేసుకోవయ్యా..

\- - - - - -

నా అహము నశించునట్లు, చక్షు, భావ, స్పర్శ దీక్షలను అనుగ్రహించి
నన్ను పక్వము చేసి కాపాడుము అరుణాచలా!!

64\. మాయ విషము పట్టి తలకెక్కి చెడు
మున్నె కరుణ పట్టోసగి బ్రోవుం అరుణాచలా

స్వామీ.. అరుణాచలా! మాయ అనే విష సర్పం నన్ను కాటు వేసిందయ్యా..
ఆ విషం నా మెదడుకి ఎక్కి నేను చెడిపోకుండా దాని నుండి ముందుగా
నువ్వే నన్ను కాపాడి అనుగ్రహించు అరుణాచలా..

\- - - - - -

మాయ అనే విషము తలకెక్కి చెడుటకు ముందే
నీవు నన్ను కరుణించి కాపాడుము అరుణాచలా!!

65\. గను కృపన్ మా యాంతముగా కృప
గనవేమి గను నీ కెవరు చెప్పుటరుణాచలా

అవిద్యని, అజ్ఞానాన్ని పోగొట్టే నీ చూపును కాస్త నావైపు దయతో చూపించు స్వామి..
నువ్వు తప్ప నాకు వేరే దిక్కు లేదు.. ఈ దీనుడిని గురించి చెప్పేవారు వేరెవ్వరు లేరయ్యా...

\- - - - - -

నా మోహమును నశింప జేయుము.

లేకపోతే ఈ లోకములో నా పరిస్థితిని నీకు తెలిపే వారెవరు? అరుణాచలా!!

66. పిచ్చి వీడ నినుబోల్ పిచ్చి చేసితె
దయన్ పిచ్చిని మాన్పుము అరుణాచలా

ప్రపంచపు పిచ్చిని వదిలిపెట్టి.. నీ పిచ్చిని ఎక్కించుకున్నానయ్యా.. నాకున్న ఈ పిచ్చి కూడా పోవాలంటే ఇవ్వాల్సిన మందు ఇవ్వగలిగే వైద్యుడు నువ్వు తప్ప వేరెవ్వరూ లేరయ్యా..

- - - - - - -

ప్రాపంచిక పిచ్చిని వదిలించి, నిన్ను పొందవలెనన్న పిచ్చిని పెంచితివి.
ఆ పిచ్చిని కూడా పోగొట్టు మందును, అనుగ్రహించు అరుణాచలా!!

67. నిర్భీతి నిను చేరు నిర్భీతు నను చేర భీతి
నే(నీ)కేలకో అరుణాచలా

నిన్ను చేరితే ఏ భయము ఉండదని నిన్ను ఆశ్రయించి నా భయాన్ని పోగొట్టుకున్నాను..
నువ్వు కూడా నిర్భయుడవే.. భయంలేనివాడవే కదా..
మరెందుకు భయపడుతున్నావయ్యా.. అరుణాచలా!

- - - - - - -

భీతి లేని నిన్ను చేరుటకు, నిర్భయముగా వచ్చిన
నన్ను చేరుటకు నీవు భీతి చెందనేల అరుణాచలా!!

68. అల్ప జ్ఞాన మదేది, సుజ్ఞాన మేదయా
ఐక్య మంద కరుణింపు అరుణాచలా

అల్పజ్ఞానమేదో.. అసలైన జ్ఞానమేదో నాకు తెలియదు శివా! అన్ని భ్రమలను తొలగించే శక్తి నీ దయకు మాత్రమే ఉంది. అటువంటి దయతో నాకు సత్యజ్ఞానాన్ని బోధించుమయ్యా..

- - - - - - -

అజ్ఞానమేదో, సుజ్ఞానమేదో తెలియని నాకు,
సత్యజ్ఞానమును బోధించి కరుణింపు అరుణాచలా!!

69. భూ గంధమగు మది పూర్ణ గంధము గొన
బూర్ణ గంధ మొసంగు మరుణాచలా

ప్రాపంచిక విషయ వాసనలతో నా మనసంతా నిండిపోయింది. అటువంటి మనస్సును వాసనలే లేకుండా చేసి.. నీలో సంపూర్ణంగా కలిసిపోయే అదృష్టాన్ని కలిగించు స్వామి.. అప్పుడే ఈ జన్మకు పరిపూర్ణత.. నేను పరిపూర్ణమగుదును..

\- - - - - - -

ప్రాపంచిక విషయములలో నిండిన నా మనసును నిర్వాసనాయుతము చేసి,
పూర్ణవస్తువు నందు ఐక్యము చేయుము అరుణాచలా!!

70. పేరు తలపగనే పట్టి లాగితివి నీ మహిమ
కనుదురెవరరుణాచలా

ఎంతటి దయ స్వామి నీది.. అరుణాచలా అని నిన్ను తలంచుకోగానే మరుక్షణమే నన్ను నీ దగ్గరకు రప్పించుకున్నావు కదయ్యా శివయ్యా.. నీ మహిమను తనివితీరా ఎవరు వర్ణించగలరు చెప్పు..

\- - - - - - -

నీ పేరు తలంచినంతనే పట్టి నీ చెంతకు లాగితివి,
నీ మహిమ తెలిసిన వారెవరు అరుణాచలా!!

71. పోగ భూతము పూని భూతమై పట్టినన్
భుతగ్రస్తుని చేసి తరుణాచలా

ఈ లోకమనే అహం పిశాచం నన్ను పట్టుకుంది... నానుండి ఆ పిశాచం పారిపోయేటట్టు చేశావు.. ఇందంతా బాగానే ఉంది కానీ స్వామి అదే సమయంలో నన్ను నీ కౌగిటిలో పిశాచిలా బంధించి భూతాన్ని చేశావు.. ఇది కూడా నీ అనుగ్రహమే..

\- - - - - - -

నా అహమను పిశాచమును పొగొట్టుటకు, వదలని పిశాచివై పట్టి,
నన్ను పిశాచిగనే చేసితివి, ఇదేమి చిత్రము అరుణాచలా!!

72. మృదులతన్ నే బ్రాపు లేక వాడగనీక
పట్టు కొమ్మయి కావు మరుణాచలా

ఎటువంటి ఆధారం లేకుండా తీగ నిలవలేదు కదా.. నేను కూడా ఆ తీగ వంటివాడనే స్వామి.. తీగకు బలమైన చెట్టు ఆధారమైనట్టు.. నాకు కూడా నీ అండ ఎప్పుడూ ఉండేలా చూడవయ్యా.. అరుణాచలా!

- - - - - - -

పట్టులేక లేత తీగ వాడినట్లు, నేను కృశించకుండా,
నా పట్టుకొమ్మవై నన్ను కాపాడుము అరుణాచలా!!

అరుణాచల శివ అరుణాచల శివ అరుణాచల శివ అరుణాచలా
అరుణాచల శివ అరుణాచల శివ అరుణాచల శివ అరుణాచలా

.. అరుణాచల రూపంలోనున్న ఓ పరమశివా ..

73. పొడిచే మయికపర్చి నా బోధ
హరియించి నీ బోధ గనుపించితి అరుణాచలా

నా అహంకారాన్ని నశింపజేసేందుకు నీ దయ అనే మత్తు మందు ఎక్కించి మాయం చేశావు. నా ప్రాపంచిక బంధాలన్నిటినీ తొలగించావు. నీ ఆత్మానుభవాన్ని కలిగేలా చేశావు.

- - - - - - -

నీ కృప యనెడి మత్తుమందుతో నన్ను మైకపరచి నా బోధమును నశింపజేసి
నీ శివానుభవమును నాకు కలుగజేసితివి అరుణాచలా!!

74. రాకపోకలు లేని సమరంగ దివి జూపు
మా కృపాపోరాటం అరుణాచలా

రాకపోకలు లేనేలేని చిదాకాశంలో (మనస్సులో) నిరంతరం జరిగే పోరాటంలో విజయం సాధించాలంటే.. నీ దయ మాకు తప్పక కావాలి స్వామి.. అదే విజయాన్ని కలిగిస్తుంది.

- - - - - - -

రాకపోకలు లేని చిదాకాశమునందు దివ్యశక్తి పోరాటమును చూపుము అరుణాచలా!!

75. భౌతిక మౌ మేని పట్టార్చి యెపుడు నీ
మహిమ గన కరుణింపు అరుణాచలా

ఈ దేహాత్మ బుద్ధిని వదిలించవయ్యా.. నిరంతరం నీ సత్య – సత్వ స్వరూపాన్నే చూసేటట్టు – అది మాత్రమే చూసి ఆనందించేటట్లు అనుగ్రహించు స్వామి...

– – – – – – –

దేహాత్మ బుద్ధిని వదిలించి నిరంతరము నీ స్వత్స్వ రూపమును చూసి ఆనందించునట్లు నన్ను అనుగ్రహింపుము అరుణాచలా!!

76. మలమందు నీవియ్య మలమగుటయో
కృపా మలమందువై వెలుగు అరుణాచలా

నా దేహ భ్రమలన్నిటినీ నీ దయతో తీసేసావు కదా.. మరి మళ్ళీ నా మోహ స్థితిని ఎలా పొందగలిగాను.. చెప్పవయ్యా.. ఇలాంటి లౌకిక అజ్ఞానాల్ని పోగొట్టడానికే కదా స్వామి .. నువ్వు అరుణగిరిగా వెలిసింది...

– – – – – – –

నా భ్రమలకు మందైన ఓ జ్యోతి స్వరూపమా! దేహ భ్రమ పోవుటకు జ్ఞాన ఔషధమును నీ విచ్చిన పిదప తిరిగి మోహమునందు ఉండగలనా అరుణాచలా!!

77. మానము గొని చేరువారి మానము
బాపి నిరభిమానత వెలుగు అరుణాచలా

స్వామి అరుణాచలా! నేను అని అభిమానంతో నీ దగ్గరకు వచ్చిన భక్తుల అహంకారాన్ని పోగొట్టి.. వారి హృదయంలో వైరాగ్యస్థితిని కలిగించి నిరభిమానంగా ప్రకాశించుమయ్యా..

– – – – – – –

నేనను అభిమానముతో నిను చేరవచ్చిన భక్తుల మానమును పోగొట్టి వారి హృదయమందు నిరభిమానముగా ప్రకాశింపుము అరుణాచలా!!

78. మించగా వేడెడు కించిజ్ఞుడను నన్ను
వంచింపకను బ్రోవుం అరుణాచలా

నన్ను మించినవాడవు నీవు.. నీ ముందు నేను అల్పుడను.. ఇప్పటికే కాదు ఎప్పటికీ.. కాబట్టి స్వామి దయచేసి ఇవాళ, రేపు అంటూ మాటలతో నన్ను మోసం చేయకయ్యా తొందరగా అనుగ్రహించి కాపాడవయ్యా..

- - - - - - -

నన్ను మించినవారి ముందు అల్పుడగానే ఉందును. అట్టి
నా బుద్ధిహీనతను చూసి వంచింపక కాపాడుము అరుణాచలా!!

79. నావికుడుండగ పెనుగాలి నలయు
నావను గాక కాచి బ్రోవుం అరుణాచలా

పెనుతుఫానులో చిక్కుకున్న నావకు ప్రావీణుడైన నావికుడు లేకపోతే గమ్యం లేకుండా కొట్టుకుపోయినట్లు.. ఈ సంసార సాగరంలో నా జీవితం కూడా అటువంటి నావే.. ఒక గమ్యం అనేది లేక కొట్టుకు పోతున్నానయ్యా.. ఈ నావను ఒడ్డుకు చేర్చగలిగే నావికుడవు నువ్వే.. నువ్వు మాత్రమే..

- - - - - - -

నావికుడు లేని ఓడ పెనుతుఫానులో చిక్కుకొని ఉన్నట్లు
సంసార సాగరములో చిక్కుకున్న నన్ను కాపాడుము అరుణాచలా!!

80. ముడిమూలముల్ గాన మునుకొంటివి
సరిగ ముగియ భారము లేదొ అరుణాచలా

నా అజ్ఞానానికి చివరేదో.. మూలాన్ని నేను కనుక్కోలేకపోతున్నా.. ఈ అజ్ఞాన గ్రంథి చిక్కుముడిని నా నుండి విడదీసే భారం నీ మీదే ఉంది కదయ్యా.. అరుణాచలా!

- - - - - - -

ఆది అంతము కనబడని నా చిత్ జడ గ్రంధిని
తల్లి వలె విడదీయు బాధ్యత నీదే కదా అరుణాచలా!!

81. ముక్కిడి మును జూపు ముకురము
గాక నను హెచ్చించి కౌగిలింపు అరుణాచలా

తన ముక్కు కోసేసి, ఆ మొహాన్ని అద్దంలో చూసుకోమంటే అతనికి బాధ కలిగినట్లే.. నా దోషాలను కూడా - నాకు తెలియకుండా, నా లోపాలను ఎత్తి చూపి నన్ను బాధపెట్టకుండా, నీ కౌగిలిలో నన్ను బంధించి నన్ను నీ సొంతం చేసుకోవయ్యా..

- - - - - - -

ముక్కులేనివాడి ముందు చూపబడు అద్దము వలె కాక,
నీవు నన్ను ఆదరముతో కౌగలించి కరుణింపుము అరుణాచలా!!

82. సత్యాహమున మనో మృదు పుష్ప
శయ్యపై మేన్గలయ గరుణింపు అరుణాచలా

నా భౌతిక శరీరమనే మందిరంలో మనస్సు మెత్తని పూల పాన్పువలె ఉన్నది.
అహంకారంలేని ఆ మనస్సు పాన్పుపై నన్ను నీతో ఏకం చేస్కో స్వామి.. దయతో
అనుగ్రహించు అరుణాచలా!

- - - - - -

తనువు అనే మందిరమున మనస్సు అనే మృదుపుష్ప శయ్యపై
నీతో ఐక్యమగుటకు నన్ను కరుణింపు అరుణాచలా!!

83. మీదు మీదుగ మ్రొక్కు భక్తుల చేరి నీ
వందితే మేలిమి అరుణాచలా

ఏ విధమైన అధికారం లేనివాళ్ళు - నిరుపేదలు - కపట బుద్ధిలేని అమాయకులు
నీ భక్తులు.. అటువంటి భక్తులని కలిసి కీర్తి ప్రతిష్ఠలు పొందావు కదా!

- - - - - -

దీనాతిదీనులై నిన్ను సేవించు భక్తులను కలిసి
నీవు గొప్ప కీర్తిని సంపాదించుకొంటివి అరుణాచలా!!

84. మై మై దణచి క్రుపాంజనమున నీ సత్య
వశ మొనరించితి అరుణాచలా

సత్యానికి నన్ను దూరం చేసిన అజ్ఞానాన్ని నశింపచేయవయ్యా.. నీ దయ అనే అంజనం
నా మోహమనే చీకట్లో నిన్ను దర్శింపచేసి నీ వాడిని అయ్యేలే చేసింది.

- - - - - -

చిమ్మచీకటి లాంటి నా మనోమోహమును నీ కృపాంజనముచే పొగొట్టి
నీ స్వరూప వశమును చేసుకొంటివి అరుణాచలా!!

అరుణాచల శివ అరుణాచల శివ అరుణాచల శివ అరుణాచలా
అరుణాచల శివ అరుణాచల శివ అరుణాచల శివ అరుణాచలా

.. అరుణాచల రూపంలోనున్న ఓ పరమశివా ..

85. మొగ్గ పరిపి నను బట్ట బయట నీవు
నట్టాడు టేలకో అరుణాచలా

నా హృదయాన్ని నీ ఆటస్థలంగా చేసుకున్నావు.. నా నుండి అహంకార మమకారాలను పోగొట్టావు.. నీ ఉనికితో నా హృదయాన్ని నింపేశావయ్యా.. అరుణాచలా!

- - - - - - -

నా అహంకార మమకారములను బోడి చేసి (పోగొట్టి)
చిదాకాశమునందు నీవు ఆనంద తాండవము చేసితివి అరుణాచలా!!

86. మోహము దప్పి నీ మోహ మొనర్చి
నా మోహము తీరదా అరుణాచలా

భౌతిక కోరికలను నా హృదయంలో నుండి తీసేశావు.. అది తప్పించి నీపై వ్యామోహం పెంచావుగా.. నీపైనున్న ఈ మోహాన్ని కూడా తీసేయ్ స్వామి.. అరుణాచలా!

- - - - - - -

నా ప్రాపంచిక మోహమును తప్పించి నీపై వ్యామోహమును పెంచితివి.
ఆ మోహమును నీవు తీర్చవెందుకు అరుణాచలా!!

87. మౌనియై రాయిగా నలరక నున్నచో
మౌన మిది యగునో అరుణాచలా

ఇంత మౌనం ఏమిటయ్యా.. అరుణాచలా! .. బండరాయిలా ఉన్న మౌనస్థితి నిజమైన మౌనము కాదు .. అది ఏ మాత్రం ఆదర్శనీయం కాదు..

- - - - - - -

కటిక రాయి వలె విరియని జడత మౌనము వహించినంత మాత్రమున
అది నిజమైన మౌనమగునా? అరుణాచలా!!

88. ఎవరు నా నోటిలో మన్నును గొట్టి నా
బ్రతుకును హరించినది అరుణాచలా

ఓ అరుణాచలా! నా నోటిలో మట్టి కొట్టి నా జీవితాన్ని హరించింది ఎవరు–నువ్వే కదా..
(నోటిలో మట్టి కొడితే వేరే దేనిపైనా రుచి తెలియనట్లుగా లౌకిక విషయాలపై ఆసక్తి
కలగకుండా స్వామి అనుగ్రహించాడు)

\- - - - - - -

నా నోటిలో మన్ను కొట్టి, నా బ్రతుకును నాశనము చేసినది ఎవరు?
నీవు కాదా అరుణాచలా!!

89. ఎవరు గనక నాడు మదిని మైకపరిచి
కొల్లగొనిన దెవర రుణాచలా

దగ్గరున్నవారికి కూడా తెలియకుండా.. నా మనసుని నీ మైకంలో ముంచి.. నీ వశం
చేసుకున్నావు.. నా మనసును దోచేసిన ఈ దోపిడీ గురించి నీకూ, నాకూ తప్ప
మరెవ్వరికీ తెలియదు.. అరుణాచలా!

\- - - - - - -

దగ్గరివారు కూడా గ్రహింపనంతగా నా మదిని మైకపరిచి
నన్ను దోచుకుని పోయినది ఎవరు? అరుణాచలా!!

90. రమణు డనుచు అంట్టి రోషము గొనక
నన్ రమియింప చేయ రమ్ము అరుణాచలా

నా ప్రియుడవు నీవు.. నీ ప్రియురాలిని నేను – గొప్పవారిలో గొప్పవాడివి నువ్వు ..
అలాంటి నిన్ను నా ప్రియుడు అని పిలిచే సాహసం చేస్తున్నా – చనువు తీసుకున్నానని
కోపగించుకోకయ్యా .. ఓ అరుణాచలా!

\- - - - - - -

నా నాథుడవని, నిన్ను రమణుడని ప్రేమతో పిలిచితిని.
రోషము చెందక నన్ను రమియింప చేయుము అరుణాచలా!!

91. రేయింబవలు లేని బట్ట బయటి యింట
రమియింపగా రమ్ము అరుణాచలా

రాత్రి, పగలు లేని.. అవధులంటూ లేని చిదాకాశంలో.. నిత్యానందంలో మనిద్దరం కలిసిపోదాం రా స్వామి..

- - - - - -

రాత్రి పగలు లేని బట్ట బయట ఇంటిలో మనము కలిసి
రమించెదము రమ్ము అరుణాచలా!!

92. లక్ష్యముంచి అనుగ్రహా అస్త్రము వైచి నన్
గబళించి తుసురుతో అరుణాచలా

లక్ష్యశుద్ధితో, గురిచూసి నీ దయా అస్త్రాన్ని దయచేసి నాపై ప్రయోగించి నన్ను ప్రాణాలతో కబళించు.. అరుణాచలా!

- - - - - -

నాపై గురి చూసి అనుగ్రహాస్త్రమును వదలి,
నన్ను ప్రాణములతో కబళించితివి అరుణాచలా!!

93. లాభమీ విహపర లాభ హీనుని చేరు
లాభ మేమి అందితివి అరుణాచలా

నా దొక సందేహం స్వామి. నువ్వు నాపై దయ చూపించడం వల్ల నాకు ఎంతో లాభం. కానీ, దేనికీ పనికిరాని నన్ను అనుగ్రహిస్తే నీకేం లాభం..

- - - - - -

నీవు నాకు దొరకడము నాకు లాభమే కానీ ఇహపరములయందు
దేనికీ కొరగాని నన్ను స్వీకరించి నీవేమి లాభమును పొందితివి అరుణాచలా!!

94. రమ్మని అనలేదే వచ్చి నావందివ్వ
వెరకు నీ తలవిధి అరుణాచలా

నీకు ఇబ్బంది అయినా.. తప్పదు స్వామి. నా అవసరాలు, యోగక్షేమాలు చూసుకోవటం నీ బాధ్యత, ధర్మం.. ఎందుకంటావా.. నువ్వు రమ్మంటేనే కదా నేను వచ్చింది.. రమ్మని అంటూ నువ్వే పిలిచావు.. అరుణాచలా!

- - - - - -

నన్ను చేర రమ్మనలేదా? అందువలన
నా యోగక్షేమములను భరించడం నీ తలవిధి అరుణాచలా!!

95. రమ్మని లోదూరి నీ జీవ మిడునాడే నా
జీవమును బాసి తరుణాచలా

నన్ను రమ్మని పిలిచావు. హృదయంలోకి ప్రవేశించి నీ స్వరూపాన్ని నాకు ప్రసాదించావు..
నా జీవాన్ని నేను కోల్పోయాను అరుణాచలా!

- - - - - -

నన్ను రమ్మని పిలిచి నా హృదయమున దూరి నీ స్వరూపమును ప్రసాదించినప్పుడే
నా జీవితము అంతమయినది, కరుణింపుము అరుణాచలా!!

96. విడిచిన కష్టమౌ విడక నిన్ ఉసురును
విడువ అనుగ్రహింపు అరుణాచలా

నాకు అదృష్టం.. దురదృష్టం రెండూ పొందేలా అనుగ్రహించు - అవి ఎలాంటివంటే -
ఆఖరి నిమిషాల్లో నీ నామస్మరణ విడిచిపెట్టని అదృష్టం - చివరి క్షణాల్లో నిన్ను
మర్చిపోయే దురదృష్టాన్ని ఇవ్వకు స్వామి!

- - - - - -

నిను మరచి నే ప్రాణములు విడిచినచో, మరల జన్మ దుఃఖము అనుభవించవలెను.
కావున నా ప్రాణములు పోవునప్పుడు
నీ స్మరణ మరవకుండా ఉండునట్లు అనుగ్రహింపుము అరుణాచలా!!

అరుణాచల శివ అరుణాచల శివ అరుణాచల శివ అరుణాచలా
అరుణాచల శివ అరుణాచల శివ అరుణాచల శివ అరుణాచలా

.. అరుణాచల రూపంలోనున్న ఓ పరమశివా ..

97. ఇల్లు విడువ లాగి లోనింటిలో జొచ్చి
యొగి నీదు నిలు చూపి తరుణాచలా

నన్ను నా ఇంటి నుండి ముందుగా బయటకు లాగి నా హృదయమనే ఇంట్లో ఉండేటట్లు
చేశావు.. అక్కడితో ఆగకుండా.. కైవల్య స్థానమైన మోక్షమనే నీ ఇంటిని చూపావు..
ఎంతటి దయ నీది అరుణాచలా!

- - - - - - -

నా యింటి నుండి లాగి నన్ను హృదయమను ఇంటిలో దూర్చి,
మెల్లమెల్లగా కైవల్య పదమగు నీ ఇంటిని చూపితివి అరుణాచలా!!

98. వెలిపుచితి న్నీదు సేత కినియక నీ కృప
వెలిబుచ్చి కావు అరుణాచలా

ఈ స్తోత్రం ద్వారా నీ లీలలు లోకానికి బహిరంగ పరిచేందుకు ప్రయత్నించాను..
నా లీలల్ని తెలియజేసే సామర్థ్యం నీకుందా అని నాపై కోపం పెట్టుకోకుండా
అనుగ్రహించి రక్షించు స్వామి!

- - - - - - -

నీవు చేసిన చేతలను బహిరంగ పరిచానని రోషము చెందక
నాపై నీ అనుగ్రహమును బయలుపరచి నన్ను కాపాడుము అరుణాచలా!!

99. వేదాంతమున వేరు లేక వెలింగెడు వేద
పదమ బ్రోవుం అరుణాచలా

వేదాంత సారం ఒక్కటే.. ప్రకాశించేది ఒక్కటే - అదే సత్యం - జ్ఞానం - అదే నిత్యం..
ఆ నిత్య సత్య జ్ఞానాన్ని, వేద స్వరూపాన్ని నాకు అనుగ్రహించవయ్యా..

- - - - - - -

వేదాంతములయందు అభేదమై వెలుగు
వేదస్వరూపమును నాకు అనుగ్రహింపుము అరుణాచలా!!

100. నింద నాశీస్సుగా గొని దయాపాత్రుగా
చేసి విడక కావు మరుణాచలా

స్వామి! బాహ్యార్థంలో నిందలుగా కనపడే పలుకులను ఈ అరుణాచల మణమాలలో నేను
పలికుంటాను.. ఆ నిందలని పొగడ్తలుగా భావించు.. నన్ను వాణిగా భావించి నీ
అనుగ్రహానికి పాత్రుడిని చేయవయ్యా అరుణాచలా!

- - - - - - -

నా నిందలను స్తుతులుగా భావించి
నీ దయా పాత్రునిగా చేసి వదలక కాపాడుము అరుణాచలా!!

101.నీట హిమముగా ప్రేమాకారు నీలో నన్
ప్రేమగ కరిగి బ్రోవు అరుణాచలా

మంచు గడ్డ నీటిలో పడితే తన నిజ స్వరూపాన్ని కోల్పోయి ఎలా కరిగిపోతుందో - అదే విధంగా నన్ను కూడా ప్రేమమూర్తివైన నీలో కరిగిపోయే అదృష్టం కలిగించు అరుణాచలా!

\- - - - - - -

మంచుముక్క నీటిలో కరుగునట్లు ప్రేమస్వరూపుడవైన
నీలో ప్రేమనై కరుగునట్లు నన్ను కరుణింపుము అరుణాచలా!!

102.అరుణాద్రి యన నే కృపావల బడితి
దప్పునె నీ కృపావల అరుణాచలా

అరుణాచలా! నిన్ను ఒక్కసారి తలచుకోగానే నీ దయ అనే
వలలో చిక్కుకునేలా చేశావు కదయ్యా.. అయినా..
నీ దయ వలలో చిక్కుకున్న వారికి ఇక బయటకు వెళ్ళే అవకాశం లేదులే..

\- - - - - - -

అరుణాచలమని తలచిన మాత్రమున నీ అనుగ్రహ వలలో చిక్కుకుంటిని,
ఆ కృపావల నుండి తప్పించుకొన సాధ్యమా? అరుణాచలా!!

103.చింతింప కృపపడ సాలీడు వలె గట్టి
చెరపెట్టి బక్షించితి అరుణాచలా

నేను తలచుకోగానే నీ వలలోకి నన్ను లాగి, చిక్కుకునేలా చేసి తన గూటిలో చిక్కిన
కీటకాలను సాలీడు ఎలా మింగుతుందో.. అలా నా అహంకారాన్ని నశింపజేశావు..
ఏమి నీ దయ అరుణాచలా!

\- - - - - - -

నీ కృపను నాపై ప్రసరింప జేసి, సాలీడువలె వలను కట్టి
నను బంధించి భక్షించితివి అరుణాచలా!!

104.ప్రేమతో నీ నామ మాలించు భక్త భక్తుల
భక్తుగా బ్రోవుం అరుణాచలా

అయ్యా అరుణాచలా! నీ నామాన్ని ప్రేమతో వినే భక్తులకు భక్తులుంటే..
ఆ భక్తులకు నన్ను దాసుడుగా ఉండేటట్లు నామీద దయ చూపించు..

- - - - - - -

ప్రేమతో నీ నామమును ఆలకించు భక్తుల యొక్క భక్తులకు
దాసుడగునట్లు నన్ను కరుణింపుము అరుణాచలా!!

105. ననుబోలు దీనుల నిం పొంద కాచుచు
చిరజీవివై బ్రోవుం అరుణాచలా

నీ మీద భక్తి కలిగిన దీనుడను నేను.. దీనులను కాపాడే దేవుడవు నీవు..
నావంటి దీనులపై నీ అనుగ్రహం ఎప్పుడూ కురిపించి కాపాడు..

- - - - - - -

నా వంటి దీనార్తులను ఆనందమయులుగా చేసి
కలకాలము మమ్ములను కాపాడుము అరుణాచలా!!

106. ఎముకలరుగు దాను మృదు వాక్కు
విను చెవిన్ గొనుమా నయల్పోక్తు లరుణాచలా

ఎంతో మంది గొప్ప భక్తులు తమ ఎముకలు కూడా కరిగేలా మధుర భావనలతో నీపై కీర్తనలు, స్తోత్రాలు చేస్తూ ఉంటారు.. వాటిని వినడానికి నీ చెవులు అలవాటు పడిపోయి ఉంటాయి. వాటితో పోలిస్తే నా మణమాల చాలా అల్పమైనదయ్యా.. అయినా వాటిని ఎలా విని ఆనందిస్తున్నావో.. నా అల్పవాక్కులను కూడా అలాగే విని ఆనందించవయ్యా..

- - - - - - -

ఎముకలు కూడా కరుగు విధముగా నీ భక్తులు పాడిన పాటలను విని ఆనందించిన నీ చెవులతో నా అల్ప వాక్కులను కూడా గ్రహించి కరుణింపుము అరుణాచలా!!

107. క్షమగల గిరి, యల్ప వాక్కు సద్వాక్కుగ
గొని కావు మరి యిష్ట మరుణాచలా

నువ్వు ఓర్పుకు నిలువెత్తు రూపానివి.. నీ రూపమే ఓర్పు.. ఈ మణమాలలోని నా నిందావాక్కులను గొప్ప స్తుతులుగా స్వీకరించి.. నన్ను మన్నించి అనుగ్రహించు స్వామి..
ఇది నా ప్రార్థన..ఆపై నీ చిత్తం.. నా భాగ్యం..

- - - - - - -

క్షమయే మూర్తీభవించిన ఓ గిరిరాజమా!! నా అజ్ఞానముతో పల్కిన పల్కులను గొప్పవిగా భావించి, మన్నించి కాపాడుము, తరువాత నీ ఇష్టము అరుణాచలా!!

108.మాలను దయచేసి అరుణాచలరమణ నా
మాల దాల్చి బ్రోవు అరుణాచలా (2)

(ఈ మణమాల మధుర భక్తి సంప్రదాయంలో వ్రాయబడింది. రమణులు తానొక వధువుగా.. అరుణాచలేశ్వరుడిని వరుడిగా భావించి.. వివాహంలో వధూవరులు దండలు మార్చుకొన్నట్లు ఇక్కడ భగవాన్ రమణులు ఈ విధంగా చెప్తున్నారు.)


నీ మీది తీవ్ర ప్రేమ అను మాలను అనుగ్రహించి అరుణాచల రమణా! నేను ప్రేమతో కూర్చిన అక్షరమణమాలను నీవు ధరించి నన్ను బ్రోవుము అరుణాచలా!!

\- - - - - -

అక్షర సుగంధభరితమైన, ప్రేమతో కూర్చబడిన ఈ అక్షర మణమాలను నీకు సమర్పిస్తున్నా.. నీ దయ అనే దివ్య మాలను నాకు ప్రసాదించి నన్ను రక్షించు స్వామి..

అరుణాచల శివ అరుణాచల శివ అరుణాచల శివ అరుణాచలా
అరుణాచల శివ అరుణాచల శివ అరుణాచల శివ అరుణాచలా(3)

\- - - = - - -



"ఓం"

ఓం మిత్యే కాక్షరం బ్రహ్మవ్యాహరన్ మామనుస్మరన్
యః ప్రయతి త్యజన్ దేహం సయాతి పరమాగతిం॥

(ఓం అను అక్షరం ఒక్కటే బ్రహ్మం. దానిని స్మరించుటయే నన్ను స్మరించుట. ఓంకారమును స్మరించుచు ఎవరు దేహమును విడుచు చున్నారో వారు పరమాగతి అయిన నన్ను పొందుచున్నారు)

(భగవద్గీత 8వ అధ్యాయం అక్షర పరబ్రహ్మ యోగం)

"అవ్వయార్"

"అవ్వయార్ జీవితంలో ఎక్కువగా సంతృప్తి నిచ్చేది ఇతరులకు సహాయం చేయటం. జీవితంలో స్వార్థం పెనుభూతం లాంటిది. "జీవితంలో తప్పులు పట్టడం ప్రారంభిస్తే స్నేహితులు, బంధువులు ఎవ్వరూ మిగలరు" అని చెప్పిన కవయిత్రి అవ్వయార్. ఈమె చేర, చోళ, పాండ్య రాజాస్థానాలను సందర్శించింది. అమె చెప్పిన ఒక చాటువు యొక్క అర్థం - వాదవర్ అనే నృపాలుడు తరువాత రమ్మన్నాడు. వత్తవర్ రేపు రమ్మన్నాడు. యాదవర్ లేదన్నాడు. ఈ ముచ్చరిలో తరువాత, రేపు అని చెప్పి వాయిదా వేసిన వారికన్న లేదని నిశ్చయంగా చెప్పిన వాడే ఉత్తముడు)

"అవ్వ కైలాసం వెళ్ళి పరమేశ్వరున కెదురుగా కాళ్ళు చాచుకుని కూర్చున్నది. ఇది చూసిన పార్వతీదేవికి పట్టరాని బాధ కలిగింది. పరమేశ్వరునికి ఎదురుగా కాళ్ళు చాచిందే, ఇది అపరాధం కదా అన్న దిగులుతో "నేను చెప్పనా అవ్వతో" అని పరమేశ్వరునికి మనవి చేయగా, "అమ్మో, మాట్లాడకు, ఆమెనేమీ అనరాదు" అని అన్నాడు ఈశ్వరుడు.

అయినా ఆ అమర్యాదను సహించలేక చెలికత్తెతో చెప్పగా, ఆ చెలికత్తె అవ్వను సమీపించి "అవ్వా ఆవ్వా, కాళ్ళు ఈశ్వరుని వైపు పెట్టకు"అని అన్నదట. "అట్లాగే అమ్మా, ఈశ్వరుడు ఎటు లేడో చెప్పు. ఇటు తిప్పనా? అని కాళ్ళు ఇటు తిప్పితే ఇటు, అటు తిప్పితే అటు పరమేశ్వరుడు తిరగవలసి వచ్చింది. అప్పుడు పార్వతిని చూసి, "చూసావా? నేను చెబితే విన్నావు కాదు, ఆమె నన్నెలా తిప్పుతుందో చూడు" అని ఈశ్వరుడు అనగా అంతట అవ్వని క్షమించమని అడిగింది పార్వతీదేవి.

తమిళములో అవ్వయార్ అనగా "అవ్వ" అని అర్థం. చిన్నతనము నుండే ఆమెకు కావ్యాలు, కవితలు వ్రాయడం బాగా అలవడింది. ఆమెకు నాలుగు సంవత్సరాల వయసులోనే మహామహులు చెప్పలేని వేదాంత విద్యను శ్లోకాలలో చెప్పడం ఆరంభించింది.

ఆమెకు శివ సాన్నిధ్యమే అంతా తప్ప వేరొకరిని మనసులో ఎపుడూ కలనైనా ఊహించుకునేది కాదు. యుక్తవయసు వచ్చి ఆమె అందచందాలు గుణగణాలు చూసి ఎన్నో సంబంధాలు వచ్చాయి. ఆమె తల్లి దండ్రులు ఆమెను యోగ్యుడైన వరునికి ఇచ్చి పెళ్లి చేయాలని నిశ్చయించుకున్నారు.

ఒక సుముహూర్తాన ఆమెకు పెళ్ళి నిశ్చయం అయింది. ఆమెకు పెళ్లి చేసుకుని, వైవాహిక సాంసారిక జీవితం గడపటం సుతారాము ఇష్టం లేదు. తను చిన్నప్పటినుండీ ఎంతో భక్తి శ్రద్ధలతో పూజించే గణేశుని విగ్రహం దగ్గర కూర్చుని తనను ఈ విషమ సమస్య నుండి గట్టున వేయవలసిందిగా కోరుకుని, తనకు అసలు సమస్య అంతా ఈ అందము తెస్తున్నదే కావున తనకు ఈ అందము తీసివేసి వృద్ధురాలిని చేయవలసిందిగా ప్రార్థించింది. ఆమె మొర ఆలకించిన గణపతి ఆమె అందము తీసివేసి వృద్ధురాలిని చేసాడు. ఆ విధంగా ఆవిడ అవ్వయార్‌గా మారి ఎంతో ప్రాచుర్యం పొంది ఎన్నో నీతి, భక్తి గీతాలు ఆలపించిన మహా భక్తురాలు.

- - - × - - -

నందీశ్వరుని అనుమతి లేనిదే శివపూజ చేయకూడదా?

నందీశ్వరుని ప్రార్థించిన తర్వాతే శివ దర్శనానికి వెళ్ళాలి. నందీశ్వరుని అనుమతి లేనిదే శివపూజ చేయకూడదు. అలా చేస్తే ఫలితం శూన్యం.

" నందీశ్వర నమస్తుభ్యం శాంతా నంద ప్రదాయకం।
మహాదేవ సేవార్థం అనుజ్ఞాం దాతుమర్హసి"॥

అని ప్రార్థించి ఆయన కొమ్ముల మధ్యనుండి శివలింగాన్ని చూస్తూ "ఓం హర, ఓం హర" అంటూ ప్రార్థిస్తే ఏడుకోట్ల మహామంత్రాలను జపించిన ఫలాన్ని పొందుతారు --- యువతులు అపసవ్యంగా, బ్రహ్మచారులు సవ్యంగాను, గృహస్థులు సవ్యాపసవ్యములుగాను శివ ప్రదక్షిణం "చండీ" ప్రదక్షిణం చెయ్యాలి. శివునికి ప్రదక్షిణం చేసేటప్పుడు సోమసూత్రం దాటరాదు. చండీ ప్రదక్షిణం ఒకసారి చేస్తే 30 వేల సార్లు ప్రదక్షణ చేసిన ఫలితం వస్తుంది.

భస్మధారణలోని అంతరార్థం

" ఎంతో నిగూఢత్వం నిండివున్న భస్మాన్ని మరే ఇతర దేవుడుగాక పరమశివుడే ధరించడంలో అంతరార్థం ఏమిటో - మరే ఇతర దైవాలు ఎందుకు భస్మాన్ని ధరించరో - శంకరుడే ధరించడానికి గల కారణం ఏమిటో చెప్పే కథ ఒకటుంది."

మహర్షి ఆశ్రమానికి సద్బ్రాహ్మణుడి వేషంలో తరలి వచ్చాడు పార్వతీశుడు. సాటి బ్రాహ్మణుడిని చూడగానే ఘనంగా స్వాగతం పలికి అతిథి మర్యాదలు చేసాడు మహర్షి. మర్యాదలన్నీ పొందిన తరువాత బ్రాహ్మణ వేషధారియైన గంగేశుడు మహర్షిని ఉద్దేశించి "మహర్షీ! అతిథి సత్కారాలు సంపూర్ణంగా తెలిసిన నీకు విజయోస్తు! నీ వంటి జ్ఞానసంపన్నుడు, తపోధీరుడు సుఖదుఃఖాలకు అతీతుడై ఉండాలి. సంతోషాలను, అవేశకావేశాలను అదుపులో ఉంచుకోవాలి. కానీ నువ్వు ఏ విషయాన్నో పదేపదే స్మరించుకుంటూ మహా సంబరపడుతున్నావు. నీ అంతటి అమిత తపోధీరుడిని సైతం మాయ చేసి ఇంతగా సంతోషపెట్టి ఉబ్బి తబ్బిబ్బు చేస్తున్న సంగతి ఏమిటో నేను తెలుసుకోవచ్చునా?" అని అడిగాడు.

అంతవరకు తనలోనే దాచుకున్న సంతోషాన్ని పంచుకునేందుకు ఒకరు వచ్చినందుకు మహర్షి ఎంతగానే సంబరపడుతూ " ఓ సాధుపుంగవా! నా అమితానందానికి కారణం నువ్వు తెలుసుకుంటే ఎంతటి తపః స్సంపన్నుడైనా దైవాంశ సంఘటనలకు సంతోష పడడం సహజమేనని తెలుసుకుంటావు. నా చేతి వ్రేలు గాయపడినపుడు గాయం నుండి రక్తానికి బదులు, పరిమళభరిత ద్రావకం వెలవడుతోంది. అంటే నా తపస్సుకు పరంధాముడు అంగీకరించినట్లే కదా! ఇంతకంటే ఆనందకారకం ఏం కావాలి" అంటూ వివరించాడు.

పరమశివుడు మహర్షి అజ్ఞానానికి నవ్వుతూ "మహర్షీ! నీ అమాయకత్వానికి ఎంతో దిగులుగా ఉంది. ఈ శరీరం, సకల జీవరాశులు, సమస్త ప్రకృతి, ఈ అనంత విశ్వమంతా ఏదో ఒక సమయంలో లయం కావసినవే. అలా లయమైనపుడు సహజ ధర్మాలకు ఆధారమైన ఆకృతి కాలి మసి కావలసిందే. అలాంటి సంపూర్ణ లయత్వంలో సృష్టిలో మిగలేది బూడిదే. శాశ్వతమైన బూడిదను పొందడమే అద్భుతమైనది. నా వ్రేలి నుండి అటువంటి శాశ్వతానందం నీవు చూడగలవు" అంటూ తన వ్రేలిని సున్నితంగా గాయపరచుకున్నాడు. ఆ వెంటనే స్వామి వ్రేలి నుండి బూడిద రాలసాగింది. వచ్చినది ఈశ్వరుడని గ్రహించి 'స్వామీ! నా అజ్ఞానం తెలియవచ్చింది. ఎంతో అద్భుతాన్ని నాకు చూపించి, నా అజ్ఞానం పోగొట్టిన నీవు ఎవరో నీ దివ్యరూపమేమిటో నాకు చూపి నన్ను ధన్యుడిని, పునీతుడిని గావించు" అని మహర్షి వేడుకున్నాడు. విశ్వనాథుడు తన అమిత మహోన్నత సుందర దివ్య సమ్మోహన రూపంతో దర్శనమిచ్చాడు.

-- - = - - -


(ఎక్కడైనా తప్పులు ఉంటే సహృదయంతో తెలియజేయవలసినదిగా మనవి.–944 044 9650, 994 994 1430)